నూతన కార్యవర్గం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి సాకేత్ ప్రణామం ప్లాట్ ఓనర్స్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. మూడు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించగా.. ఫ్రెండ్స్ అసోసియేషన్‌కు చెందిన వల్లభేంద్ర రెడ్డి, శ్రీరంగరావు, రాజ్‌కుమార్‌లు గెలుపొందారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికల్లో కమిటీ అధ్యక్షులుగా సంకుల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వెంకటరత్నమ్మ, ప్రధాన కార్యదర్శి నిరంజనరావు, సహ కార్యదర్శి శకుంతలదేవి, కోశాధికారి శ్రీరంగరావు, సభ్యులను ఎన్నుకున్నారు. వరప్రసాద్‌రావు, చంద్రశేఖర్, సూర్యనారాయణరాజు, శోభన తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి



ఘట్‌కేసర్: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఏకం చేసి బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు, మాజీ వార్డు సభ్యుడు ఆనంద్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరూ సమానమేనని అందరికీ ఓటుహక్కు, ప్రాథమిక హక్కులు రాజ్యాంగం ద్వారా అందజేశాడన్నారు. లాల్ నీల్ కలిసి రాజ్యాధికారం సాధించాలని, అంబేడ్కర్ ఆలోచన విధానాలను నేటి యువత అనుసరించాలని సూచించారు. దాసు, రాందాసు, రాజేష్‌కుమార్, రవి, శ్రీకాంత్, అంజయ్య, గణేష్‌గౌడ్, శేఖర్, విష్ణు, వివేక్, అఖిల్, లలిత్, సోము పాల్గొన్నారు.

మండల డీవైఎఫ్‌ఐ నూతన కమిటీ

మేడ్చల్: మండల డీవైఎఫ్‌ఐ నూతన కమిటీని మేడ్చల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంజిత్ రెడ్డి, కార్యదర్శిగా బాలకిరణ్‌లను ఆదివారం ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా నర్సింహ్మా, మహేందర్, ప్రశాంత్, లోకేష్, కమిటీసభ్యులుగా వినయ్, బాబు, సోహెల్, సాయిచరణ్, సాయినాథ్, సద్దాం, సాయి, ప్రవీణ్‌లతో పాటు మరో 14 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య దీక్షాలయ గురువు లక్ష్మీశంకర్ సొది నుంచి ఆన్‌లైన్‌లో నేర్చుకున్న శిష్యబృందం ఉప్పల్‌లో నిర్వహించిన కూచిపూడి ప్రదర్శనలో పాల్గొని మెప్పించారు. వినాయకకౌతం, గీతరసికె, జతిస్వరం, సతులలా, రామాయణ శబ్దం తదితర అంశాలను గాయత్రి, శ్రీవాణి, వెంకట్ దీక్షితులు తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసుల దాడి

శామీర్‌పేట్: పేకాట స్థావరంపై ఆదివారం మేడ్చల్ ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ, బాబాగూడ పరిధిలోని ఓ ఫామ్‌హౌజ్‌లో పేకాడుతున్న జూదరులను మేడ్చల్ ఎస్వోటీ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 20 వేల నగదు స్వాధీనం చేసుకుని, శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఉచిత కంటి వైద్య శిబిరం



అల్వాల్: అల్వాల్ ఐల్యాండ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై కంటి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక కాలనీవాసులు కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. సుకుమార్, కమల్, మనోజ్ఞ, శ్రావణి, అమీర్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీకి ఎదురుచూపు!

ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా ఉన్నా.. ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

- మహాలక్ష్మి పథకం కింద 79,553 మంది లబ్ధిదారులు
- జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు 4.54 లక్షలు
- 15 మండలాల్లో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14.48 లక్షలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆసరాగా ఉండేందుకు వంటగ్యాస్ సిలిండర్ రూ.500 ఇవ్వాలన్న ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించింది. రాయితీ సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. సమస్యల నివృత్తికి ప్రత్యేకంగా ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం అంతగా కనిపించడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళలు గ్యాస్‌పై రాయితీ వస్తుందన్న ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరడంలేదని ఆందోళన చెందుతున్నారు.

కేంద్రం రాయితీ ఓకే.. మరి రాష్ట్రానిది

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.874 ఉండగా.. కేంద్రం రాయితీ రూ.47, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.328 పోగా, రూ.500కు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్‌ను పొందాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వినియోగదారుడి ఖాతాలో వారంలోగా జమ అవుతుండగా.. రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం తిరుగుతున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వంటివి అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆందోళన అవసరం లేదు..

రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానం, తదితర కారణాలతో రాయితీ జమకాకుండా ఉండొచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా పౌరసరఫరాలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సిలిండర్ తీసుకున్న తర్వాత 4 రోజుల్లో రాయితీ జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. కానీ దీనిపై ఎలాంటి స్పష్టత లేదని పలువురి వాదన.

గ్యాస్ కనెక్షన్లు ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తంగా 14,48,889 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో డబుల్ గ్యాస్ కనెక్షన్లు 8,52,468, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 5,11,324, దీపం కనెక్షన్లు 70,869, ఉజ్వల కనెక్షన్లు 2,593, కమర్షియల్ కనెక్షన్లు 11,635 ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద 77,553 మంది లబ్ధిదారులు ఉన్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 4,54,859 సిలిండర్లు తీసుకున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ . 14.32 కోట్ల రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది.

అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ..

రాష్ట్రం నుంచి సొమ్ము ఎందుకు.. ? జమ కావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ.. ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయితీ వచ్చినా జమకాని సొమ్ము

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇచ్చే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకావడం లేదని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా కార్యాలయానికి వెళ్లి అడిగితే రాయితీ వచ్చిందని చెబుతున్నారని పేర్కొంటున్నారు. బ్యాంకులో అడిగితే రాలేదంటున్నారని, ఎందుకు..? జమ కావడం లేదో తెలియడం లేదంటున్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి

పోచారం: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్టార్టప్‌లను ఏర్పాటు చేసే వ్యవస్థాపకులుగా ఎదిగి, ఉద్యోగాలను సృష్టించాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (హైదరాబాద్) వైస్ చాన్సలర్ ఆచార్య కిషన్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన 25వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతికరంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ.. విద్యార్థులు రాణించాలని సూచించారు. ఏటా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య సుమారు 2.70 లక్షలకు చేరిందన్నారు. పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ.. సమాజ అవసరాలను తీర్చగలగాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మహి మాట్లాడుతూ.. విద్యార్థులు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. అనంతరం బీటెక్, ఎంబీఏ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. శ్రీనిధి సంస్థ సీఈఓ అభిజిత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.టీ.సీహెచ్.శివారెడ్డి తదితరులున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన



రైల్వే వంతెన వద్ద నిరసన చేస్తున్న స్థానికులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గుంతల వద్ద స్థానికులు ఆదివారం నిరసన చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన అడుగులోతు గుంతల్లో వాహనదారులకు గాయాలవుతున్నాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రమేష్‌గౌడ్, వెంకటేశ్‌గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, ప్రేమ్‌కుమార్, ఖలీల్, రాములు ముదిరాజ్ పాల్గొన్నారు.

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

కీసర: రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. కీసర ఎస్సైలు, సిబ్బంది, కీసర మండల పరిధిలోని గ్రామపెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. ఆదివారం వినాయక చవితి మండపాల నిర్వాహకులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి మండపం నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని, మండపంలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. డీజేల స్థానంలో సాంప్రదాయ కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రోడ్డుపై దారికి అడ్డుగా మండపాలు ఏర్పాటు చేయకూడదని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, భక్తులు, దేవుళ్లను కించపరిచేలా వ్యవహరించొద్దని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, ఎస్సై ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఆంజనేయులుయాదవ్, అన్ను, కుతుబ్ తదితరులున్నారు.

మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వినాయక మండపాల నిర్వాహకులు, అన్ని పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ పెయింటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తమ రక్తాన్ని దానం చేసి ప్రాణదానం చేసిన వారు దేవుళ్లతో సమానమన్నారు. పెయింటర్స్ అసోసియేషన్ కరోనా సమయంలో కూడా రక్తదాన చేయడం ప్రశంసనీయమన్నారు. అధ్యక్షుడు బండారు విజయ్‌కుమార్, రాజు, ప్రవీణ్, శ్రీను, లక్ష్మయ్య, బీజేపీ నేత రేవు నరసింహ, తిరుపతయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కుషాయిగూడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ఆదర్శ్ (20) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రైవేటు కొరియర్‌లో ఉద్యోగం చేసుకుంటూ నాగారంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి స్కూటీపై చర్లపల్లి వెళ్లి పనిచూసుకుని తిరిగివస్తుండగా.. ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు ఎస్సై శేఖర్ చెప్పారు. కాగా కుటుంబసభ్యులెవరూ రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత, ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తదితరులు

ఉప్పల్: డివిజన్‌లో సౌత్ స్వరూప్‌నగర్ కాలనీలో నిర్వహించిన సీసీ కెమెరాలను ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు అండగా సీసీకెమెరాలు పనిచేస్తాయని తెలిపారు. నేర నియంత్రణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. అనంతరం కాలనీలో రిక్రియేషన్, లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ ఎస్సై చిరంజీవి, కాలనీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, రమణయ్య, శ్రీను, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కొకూర్‌లోని లోతట్టు ప్రాంతాలైన ప్రశాంతినగర్ కాలనీ, విల్లా ఆర్చిడ్స్ కాలనీ, జనప్రియ ఆర్కేడియా కాలనీలు వరదనీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు కాలనీల్లో వరదనీటి నిల్వ సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారంపై చర్చించారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు తుడిమెళ్ల మల్లికార్జున్, డీఈ రఘు, హైడ్రా అధికారి మునిరత్నం, రిటైర్డ్ కర్నల్ ప్రశాంత్, వెంకట్, తివారీ, బాలనర్సింహ, రామకృష్ణ, సుధాకర్, లక్ష్మణ్, చౌబెయ్, సుఖీదర్ పాల్గొన్నారు.



జిల్లా స్థాయి యోగాసన పోటీలు



యోగాసన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉప్పల్: అన్నపూర్ణ కాలనీ జోషి విద్యానికేతన్‌లో రంగారెడ్డి జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ జగదీష్ జోషి ముఖ్యఅతిథిగా హాజరై యోగాను వీక్షించారు. భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడానికి జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలను నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. యోగా ఇప్పుడు జాతీయస్థాయి క్రీడల్లో భాగమైందన్నారు. యోగాను స్పోర్ట్స్ కోటాలో కేంద్రప్రభుత్వ సంస్థల్లో సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపికైన వారు సెప్టెంబర్‌లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారన్నారు. యోగాసన హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జయరాజ్ ఆర్యన్, మేడ్చల్ జిల్లా సెక్రటరీ సూర్యప్రకాష్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాలొన్నారు.

మట్టి తవ్వి.. గుంతలు పూడ్చి

శ్రమదానం చేసిన కాంగ్రెస్ నేతలు



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి డబీల్‌పూర్‌లో ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు నడుంబిగించి గుంతలను పూడ్చివేశారు. కాంగ్రెస్ నేతలు పలుగు పార చేతబట్టి మట్టిని తవ్వి గుంతల్లో వేసి చదును చేశారు. డబీల్‌పూర్‌లోని రైల్వేస్టేషన్ నుంచి బస్టాప్ వరకు గుంతలు ఏర్పడటంతో నాయకులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. విఘ్నేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, కార్మికులకు న్యాయం చేయాలి

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలో సేకరించిన వ్యర్థాలను తీసుకెళ్లే వాహన డ్రైవర్లు, కార్మికులకు తగిన న్యాయం చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులను కోరారు. ఆదివారం సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 18 మంది డ్రైవర్లు, కార్మికులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్నవి పాత వాహనాలని, వాటికి డీజిల్ ఇవ్వకుండా నిలిపేశారన్నారు. కొత్త వాహనాలు ఇవ్వకుండా రాంకీకి అప్పజెప్పాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ సీటీఓ, జోనల్ కమిషనర్‌తో మాట్లాడానని, సమస్య పరిష్కారమయ్యేంత వరకు పాత వాహనాలను అనుమతించడంతో పాటు డీజిల్ ఇవ్వాలని అధికారులను కోరామన్నారు. త్వరలో కొత్త వాహనాలను అందజేస్తామన్నారు. ఆకుల శ్రీనివాస్, అజారుద్దీన్, బాలకృష్ణ, సంజీవ, బాబూరావు, సంజు, కార్మికులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు, కార్మికులు

పొంగుతున్న వాగులు.. నిండుతున్న చెరువులు

భారీ వర్షాలతో ఆనందంలో మేడ్చల్ వాసులు



భారీ వర్షాలకు నిండిన మేడ్చల్ పెద్ద చెరువు

- పెరిగిన భూగర్భ జలాలు, హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- గతనెలలో బోర్లు ఎండిపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి

మేడ్చల్: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా మేడ్చల్‌లో వర్షం సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి కరువును తలపించింది. ఉన్న కొద్దిమేర పొలాల్లో ఆరుతడి పంటలసాగు అడ్రస్ లేకపోవడం , పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోర్లు ఎండిపోవడం, ప్రజల అవసరాల కోసం నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయడం, నల్లాలో 3-4 రోజులకోసారి నీరు రావడంతో మేడ్చల్ ప్రాంతంలో 3 రోజుల క్రితం వరకు పరిస్థితి ఉండేది. ప్రధానంగా భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. రెండు రోజులుగా మేడ్చల్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.

3 రోజులుగా భారీ వర్షం..

మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో గత 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురు, శుక్ర, శనివారాల్లో రాత్రి సమయాల్లో 2-3 గంటల పాటు వర్షం జోరుగా కురిసింది. జోరు వర్షానికి ముసురు తోడవడంతో పట్టణంలోని చెరువులో జలకళ సంతరించుకుంది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి గత 3 రోజులుగా కురిసిన వర్షాలే పెద్ద వర్షాలు కావడంతో కరువు సమస్య దాదాపుగా తీరినట్టైంది.

పెరిగిన భూగర్భ జలాలు..

వర్షానికి నేల తడవడంతో భూగర్భ జలాలు ఒక్కసారిగా పెరిగాయి. చెరువులు, కుంటల్లో నీరు ఉన్నా.. గత వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటం, వర్షాకాలంలో సరైన సమయానికి వర్షాలు లేకపోవడంతో భూతాపం పెరిగి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అడుగంటిన నీరు ఒక్కసారిగా బోరులలోకి చేరాయి. ఊటలు పెరగడంతో బోర్లలలో నీటి సమస్య తీరింది.

రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న గౌడవెల్లి వాగు

చెరువుల ఎగువ ప్రాంతాల్లో ఉన్న వాగులు భారీ వర్షాలతో పొంగుతుండటంతో చెరువులు క్రమేపి నిండుతున్నాయి. భారీ వర్షాల కారణంగా మేడ్చల్ పెద్ద చెరువులోకి నీరు చేర్చే మేడ్చల్ -గౌడవెల్లి రోడ్డులో ఉన్న వాగు నీటితో రోడ్డు నుంచి ప్రవహిస్తోంది.

- రాయిలాపూర్, కిష్టాపూర్, రాజబొల్లారం రోడ్లలో ఉన్న వాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువుల్లో నీరు సమృద్ధిగా చేరి జలకళ సంతరించుకుంటున్నాయి. మరో 4 రోజులు భారీ వర్షాలు కురిస్తే వాగులతో పాటు చెరువులు పొంగడం ఖాయంగా కనిపిస్తుంది.



గౌడవెల్లి రోడ్డులో జోరుగా ప్రవహిస్తున్న వాగు